
ప్రజాశక్తి
గురువారం 22 ఫిబ్రవరి 2024
5
విజయనగరం



వెయిట్ లిఫ్టింగ్‌లో ఆదినారాయణ ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అరుణాచల్‌ప్రదేశ్ ఇటానగర్‌లో జరిగిన ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన బట్టు ఆదినారాయణ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించాడు. 81కిలోల విభాగంలో స్నాచ్ 135కిలోలు, క్లీన్ జర్క్ 160 మొత్తం 295 కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆదినారాయణను ఆర్జీసి జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, సీనియర్ వెయిట్ లిఫ్టర్ మత్స సంతోషి, కోచ్ అర్జున్ అభినందించారు.



బొత్సపై పోటీకి కళా లేదా గంటా?



మంత్రిని కట్టడి చేసి ఉత్తరాంధ్రలో పట్టు సాధించాలని టిడిపి వ్యూహం

ఈసారి చీపురుపల్లిలో రసవత్తర పోరే





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాను రాజకీయంగా శాసించడంతోపాటు ఉత్తరాంధ్రలో రాజకీయంగా ప్రభావం చూపగల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పై మాజీ మంత్రులు కిమిడి కళావెంకటరావు లేదా గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేందుకు టిడిపి ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో మంత్రి పోటీచేయనున్న నియోజకవర్గంలో ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలోని ఇతర నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం లేకుండా చేయవచ్చనేది టిడిపి వ్యూహంగా తెలుస్తోంది. ఈనేపథ్యంలో చీపురుపల్లి నియోజకవర్గంలో ఈసారి రసవత్తర పోటీ నెలకొనబోతుందనే చర్చ నడుస్తోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నాటి కాంగ్రెస్ మొదలుకుని నేటి వైసిపి వరకు బొత్స చెప్పిందే శాసనంగా నడుస్తున్న సంగతి తెలిసిందే. అటు విశాఖసిటీలో కూడా ఆయనకు మంచి రాజకీయ సంబంధాలు ఉన్నాయి. మరోవైపు విశాఖ ఎంపీ అభ్యర్థిగా ఆయన సతీమణి, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యంతోపాటు విశాఖ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో కూడా ఆయన ఎన్నికల ప్రచారం చేసేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన నాయకత్వ ప్రభావం వల్ల జరగబోయే నష్టాన్ని నివారించాలంటే పోటీచేస్తున్న నియోజకవర్గంలో తగిన అభ్యర్థిని రంగంలోకి దింపడమే మార్గమని టిడిపి భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గ సమాచారం. ఇందులో సామాజిక నేపథ్యాన్ని కూడా భేరీజు వేయడంతో పార్టీ సీనియర్ నాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు, మరో మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్లు పరిశీలిస్తున్నట్టుగా తెలిసింది. వీరిద్దరూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అనుచరులుగా, విధేయులుగా ఉన్నవారే. ప్రస్తుతం చీపురుపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా వున్న కిమిడి నాగార్జునకు కళావెంకటరావు సొంత పెదనాన్న కావడం వల్ల పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చని ఇరు జనాల్లోనూ, అటు పార్టీలోనూ చర్చనడుస్తోంది. పార్టీకోసం నాగార్జున కాస్త ఒక్క అడుగు వెనక్కివేస్తే పార్టీ కేడర్ చెక్కు చెదిరే పరిస్థితులు కూడా ఉండబోవని కార్యకర్తల్లో ఇప్పటికే చర్చనడుస్తోంది. అనివార్య కారణాలవల్ల కళా వెంకటరావును రంగంలోకి దింపడం సాధ్యం కాకపోతే గంటా శ్రీనివాసరావును దింపుతారన్న చర్చనడుస్తోంది. గంటా ఇప్పటి వరకు ఓటమి తెలియని నాయకుడిగా గుర్తింపు పొందారు. తొలుత 1999లో అనకాపల్లి ఎంపీగా ఎన్నికైన ఆయన ఆ తరువాత వరుసగా చోడవరం, అనకాపల్లి, భీమిలి, విశాఖ ఉత్తర నియోజకవర్గాల్లో విజయకేతనం ఎగరవేస్తూ వచ్చారు. ఇదే పరంపర గంటా చీపురుపల్లిలో కొనసాగిస్తే వైసిపిలో నాయకత్వ లోపాన్ని కూడా సృష్టించవచ్చన్న ఎత్తుగలో కూడా టిడిపి ఉన్నట్టుగా తెలుస్తోంది.

పిల్లలపై నిరంతర పర్యవేక్షణ

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం


పిల్లల బంగారు భవిష్యత్తు కు దిశా నిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పిల్లలు పాఠశాలకు హాజరుకాని రోజున వారి తల్లి దండ్రులకు తెలియజేయాలని, తల్లి దండ్రుల కన్నా ఉపాధ్యాయులే ఎక్కువ బాధ్యత తీసుకోవాలని అన్నారు. యుక్త వయసు పిల్లలపై అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ ప్రారంభించిన పరీక్షా పే చర్చ లో భాగంగా బుధవారం పరీక్షా పర్వ -6.0 కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియం లో నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కేసలి అప్పారావు మాట్లాడుతూ పెరిగిన సాంకేతికత తో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని, ఇందులో బాలలే ఎక్కువగా బలవుతున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలలో క్రేజ్ గా పర్యవేక్షణ ఉంటుందని, ప్రభుత్వ పాఠశాల వసతి గృహాలలో కూడా అదే విధమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. డ్రాపౌట్ ల పై దృష్టి పెట్టాలని, ఎక్కువగా బడి మానివేసి బయట తిరిగేవారు ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అన్నారు.

జాతీయ బాలల హక్కుల కమిషన్ సౌత్ కో ఆర్డినేటర్ చిట్టిబాబు మాట్లాడుతూ పరీక్షలు పండగ వంటివని, పండగలకు వారం ముందే ఎలా అలంకరణలతో ఉత్సాహంగా ఉంటామో పరీక్షలకు కూడా అలాగే సిద్ధం కావాలని తెలిపారు. ప్రధాని మోడీ రచించిన ఎగ్జామ్ వారియర్ పుస్తకం లో విద్యార్థి వారియర్ గా ఉండాలని, వర్రియర్ కాకూడదని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో 6 జిల్లాల్లో పరీక్షా పే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఉత్తరాంధ్ర లో విజయనగరం, విశాఖపట్నం, పాడేరు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలలహక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

డైట్ ప్రిన్సిపాల్ తవిటి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ను గుర్తించి వెలికి తీసి ఆ రంగం లో ప్రోత్సహించాలని అన్నారు. డిఇఒ ప్రేమ కుమార్ మాట్లాడుతూ తరగతి గదిలో పిల్లల్ని పిలిచే పిలుపు కూడా ఆప్యాయంగా ఉండాలని, రంగు, రూపులను బట్టి నిక్ నేమ్స్ పెట్టకూడదని, వారిని కించపరిచేలా ఉపాధ్యాయులు పిలవకూడదని తెలిపారు. పరీక్షల వత్తిడి నుండి బయటకు రావడానికి ప్రతి రోజు చదివించాలని, మొదట్లో కష్టంగా అన్పించినా తర్వాత చదువు వారి జీవన విధానం లో భాగంగా మారిపోతుందని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి మాట్లాడుతూ పిల్లలకు అమ్మ చెప్పే దానికన్నా తన టీచర్ చెప్పేదాన్నే ఎక్కువగా నమ్ముతారని, ఉపాధ్యాయులే రోల్ మోడల్స్ గా ఉంటారని అన్నారు. సమావేశంలో ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్స్ జెడి వెంకట కృష్ణారెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - భోగాపురం

ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎమ్. వెంకట కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మోడల్ స్కూల్లో జోన్ -1,2 పరిధిలోని మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులు పరీక్షలపై దృష్టి పెట్టే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. ప్రత్యేక తరగతులతో పాటు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల మధ్య పోటీ తత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా ఇష్టపడి చదివేలా వారికి నిరంతరం కౌన్సిలింగ్ నిర్వహిస్తుండాలన్నారు..పరీక్షలు దగ్గర పడుతున్నందున ఫలితాల కోసం నిబద్ధతతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఆర్జెడి జ్యోతి కుమారి, సీబీఎస్ఈ రాష్ట్ర కోఆర్డినేటర్ సి.శ్రీలత, ఎఎంఒ ఎం.శరత్‌బాబు, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి పాల్గొన్నారు.



సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లీషు పదాలు లేకుండా మాతృభాషలో అనర్గళంగా మాట్లాడే పోటీని నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథి కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు బహుమతులు అందజేశారు. - ప్రజాశక్తి, విజయనగరం

జిందాల్ భూనిర్వాసితుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, జిందాల్ అల్యూమినా కంపెనీ భూ నిర్వాసితులు చేస్తున్న నిరసన బుధవారానికి రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో జిందాల్ అల్యూమినా కర్మాగారం ఏర్పాటు చేస్తామంటే తమ భూములు అప్పట్లో గల ధరకు ఇచ్చామని, పరిశ్రమ ఏర్పాటు కాకముందే కంపెనీలో షేర్ల ద్వారా భాగస్వాములు చేస్తామని కంపెనీ నమ్మించిందని తెలిపారు. 16ఏళ్లు గడిచినా ఎటువంటి పరిశ్రమ రాని కారణంగా భూములు ఇచ్చిన పేద గిరిజనులైన తమ బతుకులు అధ్వాన్నంగా తయారై రోడ్డునపడ్డామని వాపోయారు. తమ నుంచి సేకరించిన భూముల్లో ఎమ్ఎస్ఎమ్ఇ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, పారిశ్రామిక వాడలో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని గానీ, భూములు కోల్పోయిన తమకు ఏ విధముగా భరోసా కల్పించి ఆదుకుంటారో గాని ఇప్పటివరకు కంపెనీ ప్రకటించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. అప్పట్లో భూముల విలువలో కొంత మొత్తానికి బదులు ఇచ్చిన షేర్ల ధరలను ఇప్పటి విలువ ప్రకారం మదింపు చేసి షేర్లు జారీచేసి కంపెనీలో తమకు భాగస్వామ్యం కల్పించాలని, పారిశ్రామికవాడ ఏర్పాటు చేసినపుడు తమకు ఏ విధమైన న్యాయం చేస్తారో చెప్పాలని కోరారు. దీక్షా శిబిరాన్ని ఎస్.కోట ఎంపిపి సండి సోమేశ్వరరావు, చుట్టుప్రక్కల గిరిజన పంచాయతీలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు సందర్శించి, సంఘీభావం తెలిపారు.



నిరసన దీక్ష చేస్తున్న జిందాల్ భూ నిర్వాసితులు

పరిశ్రమ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని శ్రీరాంపురం గ్రామపంచాయతీలో ఉన్న మెసర్స్ మా మహామాయ ఉక్కు కర్మాగారం విస్తరణకు బుధవారం ప్రజా అభిప్రాయ సేకరణ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్ఒ అనిత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఇన్‌ఛార్జి ప్రసాదరావు, ఇఇ సరిత తదితరులు పరిశ్రమ విస్తరణకు శ్రీరాంపురం , రెల్లిగైరంపేట పంచాయతీలతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 1,30,065 టన్నుల స్పాంజ్ ఐరన్ ఉత్పత్తి సామర్థ్యం 708630 టన్నులకు పెంచేందుకుగాను, 1,34,400 టన్నుల ప్రస్తుత ఉత్పత్తి హాట్ బిల్లెట్స్ , ఇనుప కడ్డీలు ఉత్పత్తిని 880428 టన్నుల ఉత్పత్తిని పెంచేందుకు గాను, 1,21,250 టన్నుల ఇనుప రాడ్లు , ఫైల్ రాడ్స్ రౌండ్స్ ఉత్పత్తిని 7లక్షల టన్నులకు పెంచేందుకు గాను , వాటితో పాటు మరికొన్ని పెంచేందుకు ప్రతిపాదనను ప్రజలకు వివరించారు.అనంతరం శ్రీరాంపురం, రెల్లిగైరంపేట గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిశ్రమల కారణంగా నలుపు రంగు బూడిద తమ గ్రామాలపై, పంట పొలాలపై, చెరువులపై వెదజల్లుతుందని తెలిపారు. అనంతరం డిఆర్ఒ అనిత మాట్లాడుతూ అభిప్రాయ సేకరణ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ ఆర్ మురళీవర్మ , కన్సల్టెన్సీ ప్రసాదరావు , జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి , తాహశీల్దార్ ప్రసాదరావు , ఎస్ఐ ఆర్.గోపాలరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిఆర్ఒ అనిత

ఎఎంసి అభివృద్ధికి కృషి : చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేద్దామని చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్‌గా ఆమె ఎన్నికైన తరువాత మొదటి సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా డెరెక్టర్‌లు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి సతీష్ మార్కెట్ కమిటీ ఆదాయ, వ్యయాలను డెరెక్టర్‌లకు వివరించారు. ఈ ఏడాది 2023-24 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ కమిటీ లక్ష్యం రూ. 1.61 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ. 1.30కోట్లు వరకూ పూర్తియ్యిందన్నారు. 2024-25 సంబందించి లక్ష్యం రూ.1.65 కోట్లు అని చెప్పారు. మార్కెట్ కమిటీకి సంబంధించి నెల్లిమర్ల , మోదవలసలోని గోడౌన్‌లను రిపేరు చేసి వినియోగంలోకి తేవాలని, భోగాపురంలో మార్కెట్ పనులు ప్రారంభించాలని తీర్మానం చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ అరుణకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం గోదాములన్నింటినీ వినియోగంలోకి తేవాలని అన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో ఎంతమందికి లైసెన్స్ వ్యాపారాలు ఉన్నాయో, ఎంత మందికి ఇంకా లైసెన్స్‌లు ఇవ్వాలో వివరాలు సేకరించాలని కార్యదర్శికి సూచించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సహకారం అందించే కార్యక్రమాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ భర్త చిక్కాల సాంబ, స్థానిక సర్పంచి టొంపల సీతారాం, డైరెక్టర్‌లు గొంప సన్యాసిరావు, దారపు అప్పలసూరిరెడ్డి, రోశయ్య, దేవుళ్లు, పి.నారాయణమూర్తి, సూపర్‌వైజర్ చిన్నమ్మలు, సిబ్బంది అంజిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంసి చైర్‌పర్సన్ అరుణకుమారి

టిడిపితోనే ప్రజలకు రక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజలకు రక్షణ టిడిపితోనే అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతి అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం 45వ డివిజన్ కె.ఎల్.పురం లో కొండ వీధి, మొండివీధి, బ్రాహ్మణ వీధి, రెవిన్యూ కోలనీ, బ్యాంకు కాలనీలో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రం అభివద్ధి చెందాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఎన్‌టిఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తే, చంద్రబాబు నాయుడు మహిళా అభ్యున్నతి కోసం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఎక్కడ చూసినా విధ్వంసం, అరాచకాలు, రౌడీయిజం రాజ్యమేలు తున్నాయని అన్నారు. అరాచక, అప్రజాస్వామిక పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇస్త్రీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి

జర్నలిస్టుల పై దాడి అప్రజాస్వామికం

జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామికమని అదితి గజపతిరాజు అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలపై అనేక రూపాల్లో దాడులు చేస్తోందన్నారు. తాజాగా మరింత బరి తెగించి మీడియాపై దాడులలు చేయడం హేయమైన చర్యని అన్నారు.

వైభవంగా ఖాదర్ వలి ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హజరత్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్ వలి 65వ మహా సూఫీ సుగంధ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. దేశ సమైక్యత ఫరిడవిల్లేలా కుల, మత, ప్రాంత, ధనిక, పేద తారతమ్యత లేకుండా దేశ నలు మూలల నుంచి తరలి వచ్చిన అశేష జనంతో బాబామెట్ట ఖాదర్ బాబా దర్గా, దర్బార్ కిక్కిరిసిపోయింది. ఖాదర్ బాబా ప్రియ శిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదర్ బాబా సూఫీ ఆధ్యాత్మిక వారసులైన చీమల పాడు సూఫీ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మోహియునుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీ ఆధ్వర్యాన ఖాదర్ బాబా చిత్ర పటాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి నగరంలో భారీ ఊరేగింపుగా వెళ్లి భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం దర్గాలోని బాబా సమాధికి సుగంధం చాదర్, పూలు సమర్పించారు. లంగర్ ఖానాలో భారీ అన్న సమారాధన అర్ధరాత్రి వరకు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి

ప్రచారానికి మైనర్లను వినియోగించకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ముందుగా ఇఆర్ఒ స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను తెలుసుకొని తుది జాబితాను తయారు చేయాలన్నారు. కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి, ఉన్న వాటిని రద్దు చేయడానికి అవకాశం లేదని, కేవలం ఒకే ప్రాంగణంలో ఉండి వేరొక భవనంలోకి మార్చడానికి మాత్రమే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తన ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల ఖరారు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై చర్చించారు. ఎన్నికల ప్రచారానికి బాలబాలికలను ఎట్టి పరిస్థితిలోనూ వినియోగించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసి, జాబితాను మార్చి 5వ తేదీలోగా పంపించాలని ఆదేశించారు. జిల్లా ఓటర్ల జాబితాలో పెద్దగా మార్పులు లేవని అన్నారు. ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే ముమ్మరం చేస్తామన్నారు. దీనికోసం త్వరలో స్వీప్ ప్రణాళికను వెల్లడిస్తామని, స్కిట్‌లను, షార్ట్ ఫిల్ములను రూపొందిస్తామని చెప్పారు. ముఖ్యంగా యువ ఓటర్లపై దృష్టి పెట్టి చైతన్యవంతం చేస్తామన్నారు. సున్నిత ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, అక్కడి ప్రజల్లో ధైర్యాన్ని కల్పిస్తామని చెప్పారు. లక్ష్మీపురం, మల్యాడ, ముంజేరు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్ఒలు, ఎన్నికల డిటిలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ యం.మల్లయ్య నాయుడు అన్నారు. బుధవారం కెఎల్ పురం ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడక్కడ డెబ్రీస్ గుట్టలుగా పడి ఉండడాన్ని చూసి సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. పేరుకుపోయిన చెత్తాచెదారాలు, డెబ్రీస్ వంటివి ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. పాలథిన్ సంచులలో టిఫిన్లను, వేడి వేడి పదార్థాలను వేయడాన్ని చూసి దుకాణదారులను మందలించారు.పాలిథిన్ కవర్లలో వేడి పదార్థాలను వేసి ఇవ్వరాదని చెప్పారు. కొనుగోలుదారులు కూడా టిఫిన్ బాక్సులు వంటివి తెచ్చుకొని ఆహార పదార్థాలను తీసుకుని వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు చేస్తున్న పోరాటం 21వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ డిఎ బకాయిలు చెల్లించాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ చేస్తున్న న్యాయమైన పోరాటానికి జిల్లా కార్మికులు, ప్రజల మద్దతు ఉందని తెలిపారు. అంతే కాకుండా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు కోవిడ్ సమయంలో ప్రాణాలకుతెగించి ప్రజలకు సేవలు అందించారని, హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఇలాంటి ఉద్యోగులకు న్యాయం చేయకుండా మిమ్స్ యాజమాన్యం చట్టాన్ని దిక్కరించి 7 డిఎలు బకాయిలు ఉంచడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయక పోవడం, 21రోజులు అయినా నేటికి జనవరి నెల జీతం వెయ్యకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి విడి చర్చలకు వచ్చి ఉ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ,కర్రోతు కాము నాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరీ, వరలక్ష్మి, రామకృష్ణ, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మీడియాపై వైసిపి నాయకుల దాడులు అరికట్టాలని సిపిఎం, సిపిఐ, న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులు, కార్యాలయాలపై వైసిపి చేస్తున్న దాడులను అరికట్టాలని కోరుతూ జరజాపుపేటలో గురువారం గాంధీ విగ్రహానికి నాయకులు వినతి పత్రం అందజేశారు. సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, సిపిఐ నాయకులు మొయిద పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: గత రెండు రోజులుగా మీడియా పై జరుగుతున్న దాడులు హేయమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు ఖండించారు. వాస్తవాలను మీడియా ప్రజలకు కళ్ళకు కట్టినట్లు చూపించడాన్ని ఓర్వలేక వైసిపి నాయకులు మీడియా పై దాడి చేస్తున్నారని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో అధికారంలోకి రాగానే మీడియా గొంతు నొక్కడనికి జగన్ రెడ్డి జీవో తీసుకొచ్చారని, ఇపుడు ప్రత్యక్ష దాడులకు దిగడం దారుణమని చెప్పారు.

భోగాపురం: ఓటమి భయంతోనే జగన్ మీడియాపై దాడులు చేయిస్తున్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో ఆయన స్వగృహంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రశ్నించే గళం వింటే జగన్ రెడ్డికి ఒణుకు పుడుతోందన్నారు. అందుకే ఆయనకు ప్రజలు, ప్రతిపక్షపార్టీలు, మీడియా అంటే భయం పట్టుకుందన్నారు. ఆయన భయాన్ని కప్పిపుచ్చుకునేందుకు మీడియాపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పూసపాటిరేగ మాజీ ఎంపిటిపి మురపాల బోగేష్, నాయకులు కాకి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: పత్రికావిలేకరులు, పత్రికా కార్యాలయాలపై దాడులతో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గొంతునులిమే ప్రయత్నం చేస్తోందని నినాదాలు చేస్తూ మెంటాడ, గజపతినగరం మండలాల విలేకరులు బుధవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కెంగువ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేసి అనంతరం స్థానిక ఉప తహశీల్దార్ వెంకట్రావుకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో విలేకరులు చప్ప శివకేశవనాయుడు, కె ఈశ్వర రావు, ఎస్.నాగభూషణం, వెంకటరావు, సత్యనారాయణ, సత్యం, బుజ్జి, రామకృష్ణ, శంకరరావు, శ్రీను, పాల్గొన్నారు.


నెల్లిమర్ల: గాంధీ విగ్రహానికి వినతినిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


మెంటాడ : డిటికి వినతినిస్తున్న జర్నలిస్టులు

దాడులను అరికట్టాలని కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

విజయనగరం కోట : రాష్ట్రంలో సిఎం సభను కవర్ చేయడానికి వెళ్లి ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ పైనా, కర్నూలు ఈనాడు కార్యాలయంపైనా వైసిపి మూకలు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని జర్నలిస్టులు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దాడులు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఎటాక్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే కమీషనర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముగిసిన యాదవ సంఘాల ఐక్యవేదిక ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట


నిమ్మరసం ఇస్తున్న ఈసరపు శేఖర్

విజయనగరం అసెంబ్లీ టిక్కెట్, ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36గంటల నిరవధిక ధర్నా బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్‌యాదవ్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బిస్సాపు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ ఏ జిల్లాలో లేని విధంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా యాదవులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. విజయనగరం అసెంబ్లీ, ఎమ్మెల్సీ సీటు కోసం యాదవ గర్జన, పలు పార్టీల అధ్యక్షులకు వినతులు ఇచ్చామని, స్పందించకపోవడంతో 36గంటల ధర్నా చేపట్టామని తెలిపారు. ఇప్పటికీ స్పందించకపోతే రానున్న రోజుల్లో పార్టీ కార్యాలయాల ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పదాలి గణేష్, బిసి సంఘ నాయకులు గొలగాని రమేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘ అధ్యక్షులు సతీష్ యాదవ్, నమ్మి ప్రసాద్, బి.జగ్గారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకుల ద్వారా అందించే పలు సేవలను వివరించే వారిలో ఆర్థికంగా అక్షరాస్యత కల్పించడమే ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ముఖ్య ఉద్దేశమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఎం సింహాచలం నాయుడు అన్నారు. బుధవారం పూసపాటిరేగలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్, ఎస్‌బిఐ సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆర్థిక భద్రత, సామాజిక భద్రత రెండూ అత్యంత ప్రాధాన్యమన్నారు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు క్లర్క్ రాజేశ్వరి, తపాలాశాఖ అధికారి ప్రకాష్, సంస్థ జిల్లా సమన్వయాధికారి ఫణికుమార్, సిబ్బంది నాగేంద్ర, శైలజ, పాల్గొన్నారు.

గ్రామాల్లో సోషల్ ఆడిట్ సభలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని డిఆర్‌పేట, జగ్గయ్యపేట గ్రామాల్లో ఇంత వరకూ జరిగిన ఉపాధి హామీ పనులపై బుధవారం సర్పంచుల ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో సోషల్ ఆడిట్ డిఆర్‌పి ఎస్ పోతురాజు, ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచులు డి ముత్యాలమ్మ, ఎస్ సన్యాసమ్మ, క్షేత్రసహాయకులు, మేట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా పరుగు పందేలు

ప్రజాశక్తి - వేపాడ


పోటీలో పాల్గొన్న ఎడ్ల బండి

ఆకుల సీతంపేటలో శ్రీ వివేకానంద స్వామి జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన గుర్రం, ఎడ్ల పరుగు పందేలు బుధవారం రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీల్లో మొదటి గుర్రపు బండి యజమానికి రూ. 15వేలు, ఎడ్ల బండి పోటీల్లో విజేతకు రూ.20వేలను సర్పంచ్, ఉత్సవ కమిటీ చేతులు మీదుగా అందించారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - డెంకాడ

నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన గంధి దివ్య ముందస్తు డెలివరీ అవడంతో ఆపరేషన్ అనంతరం సిఎం సహాయ నిధి రూ.2.60లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అందించారు. ఎమ్మెల్యే స్వగ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల రమణ పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - బొబ్బిలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబినాయన

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీకు చెందిన 70 వైసిపి కుటుంబాలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో టి.రామ్మోహన్, ఎస్.శ్రీరాములు, ఎస్.త్రినాధ, వై.జగదీష్, పి.గౌరీశంకర్‌తో పాటు మరో 65 కుటుంబాలు ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు ఐక్యంగా పని చేయాలని కోరారు.

పేద విద్యార్థులకు నగదు వితరణ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన బాణాల భవాని ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థికి రాజాం నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి బొత్స బుద్ధుడు, రెండు జతలు బట్టలు, రూ.2వేలు నగదు బుధవారం వితరణగా అందజేశారు. పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ స్వప్న, రాయి శంకర్రావు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు కోరారు. గురువారం ఆయన మండలంలోని సతివాడ జెటిఎన్ఎం కళాశాలలో జరిగిన విద్యార్థుల వీడ్కోలు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరావు, సూర్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మున్సిపాలి టీలోని మల్లమ్మపేటలో బుధవారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం కాలువలలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలను కోరారు. ఆమెతో పారిశుధ్య విభాగ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట



విజయనగరం: తెలుగు తల్లికి వందనం చేస్తున్న విద్యార్థులు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తోటపాలెంలోని ఎయిమ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎఇ బాలాజీ, సురేష్ మాట్లాడు తూ ప్రపంచ భాషల్లోకి అద్భుతమైనది తెలుగు భాష అని కొనియాడారు. అనేక భాషలు తెలిసిన శ్రీకృష్ణ దేవరాయలు 'దేశ భాషలందు తెలుగులెస్స' అని కీర్తించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు వైఎస్ నాయుడు, రమేష్, చక్రధర్, పాల్గొన్నారు.

బొబ్బిలి: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు, ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బొంతు శ్రీరాములు, సిహెచ్‌జె ప్రవీణ్, కె. రామకృష్ణ, చిన్నారావులు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి మాతృభాషను పరిరక్షించుకుందామంటూ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మాతృభాష పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషకు అధిక ప్రాముఖ్యత నిస్తూ మాతృభాషకు తగిన ప్రాధాన్యత లేకుండా నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించటంతో తెలుగు భాష వినియోగం క్రమేపీ కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వం, స్వచంద సేవాసంస్థలు, ఉపాధ్యాయులు, భాషాభిమానులు, రచయితలు, భాషా పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ ఈశ్వరరావు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

కొబ్బరి అబివృద్ధి బోర్డు బృందం పర్యటన

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో కొబ్బరి అభివృద్ధి బోర్డు బృందం బుధవారం పర్యటించింది. భోగాపురం మండలంలోని ముంజేరు, రావాడ, గూడెపువలస, పూసపాటిరేగ మండలంలోని చిన పతివాడ గ్రామంలో బృందం సభ్యులైన డైరెక్టర్ ఈ అరవల్, డిప్యూటీ డైరెక్టర్ కుమార్వెల్, సైంటిస్ట్ భగవాన్ పరిశీలించారు. కొబ్బరి పునరుద్ధరణతోపాటు ప్రయోగ క్షేత్రాలను పరిశీలించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, చీడపురుగుల నివారణ, కొబ్బరి విస్తరణ గూర్చి రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ డిడి సుజాత, డిహెచ్‌ఒ జమదగ్ని, ఏడి హెచ్, ఉద్యానవన శాఖ అధికారిని జ్యోత్స్న పాల్గొన్నారు.


కొబ్బరి మొక్కను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

రాజులతో అభివృద్ధి శూన్యం

బొబ్బిలి: రాజులు హయామంలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసు హయామంలో రాజులు పార్టీ మారితే తాను నిధులు తెస్తే అప్పటిలో ప్రాతినిధ్యం వహిస్తున్న రాజులు నిధులను ఖర్చు చేసి అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రోడ్డు విస్తరణకు తాను నిధులు తెచ్చానని చెప్పారు. తన హయామంలో జరిగిన అభివృద్ధి ఎన్నడూ జరగలేదన్నారు. రాజులే బోకు మాటలు అడుతారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధమని, మీరు సిద్ధమా అని రాజులకు సవాల్ విసిరారు. అలజంగిలో బెదిరింపులకు తాము పాల్పడలేదని, వైసిపిపై అభిమానంతో పార్టీలో చేరారని అన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారన్నారు. రాజులకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఆయనతో వైసిపి నాయకులు పూడి చిన్న ఉన్నారు.

ఘనంగా వార్షిక అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - కొత్తవలస



అవార్డు ప్రదానం చేస్తున్న సిఐ చంద్రశేఖర్

మండలంలోని మంగలపాలెం వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షిక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐ వి. చంద్రశేఖర్, ఎన్‌సిసి 13 ఆంధ్ర బెటాలియన్ కమాండర్ నీరజ్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ముందుగా విద్యార్థులు చేసిన విభిన్న వినూత్న పలు నృత్యాలను తిలకించారు. అతిధులను పాఠశాల కరస్పాండెంట్ రెవరెన్స్ సిస్టర్ కేథరిన్, ప్రిన్సిపాల్ రెవరెన్స్ సిస్టర్ సుధారాణి సాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, ఒక లక్ష్యం పెట్టుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం సాధన చేయాలని, చదువును ఇష్టంతో ఒక ప్రణాళిక బద్ధంగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం గత సంవత్సరం సెంటెన్స్ పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన యోగిత శ్రీనిధికి రూ.2వేలు నగదు, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. కమాండర్ నీరజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం అన్ని రంగాలలో ఓవరాల్ ఛాంపి యన్షిప్ అవార్డును రోజెస్ గ్రూప్ విద్యార్థులు ఇన్చార్జి టీచర్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ సబితా, సుస్మిత, సునీత, బర్ల, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రామ సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రామస్వామి పేటలో బుధవారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనను మరోసారి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం మారితే ప్రస్తుతం వస్తున్న పథకాలన్నీ ఆపివేస్తారని చెప్పారు. తమ గ్రామంలోని సాలివీధిలో తాగునీరు అందడంలేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యుఎస్ జెఇని పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, పూర్తిస్థాయిలో డబ్బులు రానందున కొంత వరకే పని జరిగిందని చెప్పారు. వారం రోజులు గ్రామంలో ఏ ఒక్కరికీ తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చినరామునాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్ వెంకట్రావు, గ్రామ సర్పంచ్ శర్మ, సోంపురం సర్పంచ్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని కేజీపూడి పంచాయతీలో గల సంగంవలస, సారవానిపాలెం గిరిజన గ్రామానికి కాజ్వే నిర్మాణం పనులకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.35లక్షలతో బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల లోపే ఈ నిర్మాణం పనులు చేపడతామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు జరిగితేనే తనకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తవలసలో గల చైతన్య మానసిక పాఠశాలలో వికలాంగు పిల్లలకు వస్త్రాలు, భోజన సదుపాయం కల్పించినట్లు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. పాఠశాలలో 45 మంది పిల్లలకు టీషర్టులు, నిక్కరలు, బోజనాలు పెట్టామని చెప్పారు. అందులో పని చేసే 10 మంది ఆయాలకు చీరలు ఇచ్చామన్నారు. బలిగట్టంలో ఉన్న న్యూ హెూప్‌లో 50 మంది అనాథ పిల్లలకు చుడీదార్లు, నైటీలు, టీ షర్టులు, నిక్కరలు, బోజానలతో పాటు రూ.5 వేల చెక్కు అందించామన్నారు. వీటన్నింటికీ బెంగుళూరుకు చెందిన దర్భ శ్రీరామ్, విజయలక్ష్మి దంపతులు ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. పెందుర్తి లోయల వద్ద గల ఆచం పాఠశాలలో వంద మంది మహిళలకు దుస్తులు, భోజనం, వందమంది పురుషులకు టీ షర్టులు, దుప్పట్లు అన్నదానం చేశామన్నారు. లోయల వద్ద ఆశ్రమం తరుపున, న్యూ హెూప్ తరుపున వారికి వారితో పాటు తమ ట్రస్ట్‌కి సునీతా, తనూజా ఆర్థిక సాయం అందించారని నిర్వాహుకులు తెలిపారు.

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

ప్రజాశక్తి - వంగర


ఎంపిపికి వినతి పత్రాన్నిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు యం.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీను, వైసిపి మండల అధ్యక్షుడు కరణం సుదర్శన్‌రావును ఉపాధ్యాయులు బుధవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు యం ప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్ తీవ్ర అన్యాయం కలిగించే విధంగా ఉందని, దీని వల్ల ఉద్యోగులకు జీవిత భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్దరణ చేస్తామని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. అలా ప్రకటించిన వారికే ఓటు వేస్తామని తెలిపారు. ఈ విషయంలో మీ పార్టీ వైఖరిని తెలియజేసి, సిపిఎస్ రద్దుపై బహిరంగ ప్రకటన చేయాలని, తమరు అదినాయకత్వానికి తెలియజేసి ఎన్నికల మానిఫెస్టోలో చేర్పించి సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కోశాధికారి బి.శ్రీనివాసరావు, కార్యదర్శి బొక్కేల చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి సింహాచలం, కె శ్రీనివాసరావు, వై జయరాం, పి.మురళి పాల్గొన్నారు.

ఎస్ఐకి పురస్కారం

గుర్ల: అంతర్జాతీయ భాషా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాలలో స్వచ్ఛంద సేవలు చేసిన 10 మందిని సేవా పురస్కారానికి ఎంపిక చేశారు. వీరికి విజయవాడలోని ఆంధ్ర లోయెల కళాశాలలో అవార్డులను అందించారు. వీరిలో గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న డాక్టర్ బి.కామేశ్వరరావుకు సేవాపురస్కారం లభించింది. నిత్యం ఏదో రూపంలో గత కొన్ని సంవత్సరాలు నుండి పోలీస్ వృత్తిలో ఉంటూ సేవలందించడంతో గుర్తింపు లభించింది. అనారోగ్య ంతో బాధపడుతున్న పేద ప్రజలకు వైద్యానికి ఆర్థికంగా సహాయం చేయడం, పేద అనాథ వృద్ధులకు, పేద వికలాంగులకు ఉచితంగా బోజనాలు అందజేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి ఐఎఎస్ అధికారి ఎండి ఇంతియాజ్ చేతులు మీదుగా అందించారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం


ప్రజాశక్తి- తెర్లాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం వాలంటీర్లకు వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైసా లంచం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారధులే వాలంటీర్లు అని కొనియాడారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లును ఘనంగా సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మీ, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, వైసిపి నాయకులు గర్భాపు రామారావు, అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, బోను అప్పలనాయుడు, మర్రాపు జగన్నాధం, సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిడిఒ మధుసూదన్ రావు, తహశీల్దార్ దిలీప్‌కుమార్, ఎంఇఒ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుర్ల


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిపి ప్రమీల

గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. మండలంలో పున్నపురెడ్డి పేటలో ఎంపిపి నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కాలువలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మండలంలో అన్ని గ్రామలాభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పున్నపురెడ్డి పేట గ్రామంలో కొన్నేళ్లుగా ఉన్న రహదారి సమస్య నేటితో శాశ్వత పరిష్కారం అయ్యిందన్నారు. అనంతరం ఆమెను వైసిపి నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.లక్ష్మి, ఉప సర్పంచ్ సత్యవతి, స్థానిక నాయకులు అప్పలనాయుడు, రామకృష్ణ, రాము, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో వైద్య శిబిరం

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లి సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్‌ను తరలించాలి

బొబ్బిలి: స్థానిక కోర్టు సమీపంలో ఉన్న బార్‌ను వేరే చోటుకు తరలించాలని కోప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల జగన్ డిమాండ్ చేశారు. కోర్టు సమీపంలో బార్ ఉండడంతో కక్షిదారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల సౌకర్యం కోసం బార్‌ను తరలించాలని డిమాండ్ చేశారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- సుమారు పది లక్షలు ఆస్తి నష్టం
- దల్లిపేటలో నీలగిరి తోట దగ్ధం

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలో ఓ ఇంట్లో బుధవారం అకస్మాతుగా గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీంతో సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన శిరుగుడి అప్పలరాజు ఇంట్లో వంటపాకలో మొదట మంటలు చెలరేగాయి. అక్కడి నుంచి ఇంట్లోకి వెళ్లడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో పక్కనున్న నూర్చిన ధాన్యం దిబ్బ, పశువుల పాకతో పాటు భూములకు సంబంధించిన విలువైన దస్తావేజులు, చదువుకున్న సర్టిఫికెట్లు, కొంత నగదు, బంగారం ఈ ప్రమాదంలో కాలిపోయాయి. పక్కనే ఉన్న మరో ఇంటికి అంటుకోవడంతో వారికి సంబంధించిన వస్తువులన్నీ కాలిపోయాయి. అప్పటికే స్థానికులు చేరుకొని మంటలు ఆరిపే ప్రయత్నం చేసినప్పటికీ గాలులు వీస్తుండడంతో జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు మేరకు రెవిన్యూ అధికారులు ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు. జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు బాధితులను పరామర్శించారు.

దల్లిపేట వద్ద నీలగిరి తోట దగ్ధం

మండలంలోని దల్లిపేట వద్ద విద్యుత్ తీగల రాపిడికి నీలగిరి తోట దగ్ధమైంది. దల్లి సూరప్పయ్యమ్మకు చెందిన తోట సమీపంలో విద్యుత్ తీగలు ఉండడంతో చెట్టుకొమ్మల తాకిడి వలన ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమాచారం అందుకున్న తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐ సూర్యకుమారి, విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సుమారు ఎకరా తోట దగ్ధమైనట్లు బాధితురాలు చెబుతోంది.

వాహనం ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ సమీపంలో బొలెరో వాహనం ఢీకొని యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావు (18) తన స్నేహితుడు బమ్మిడి వాసు ఇద్దరు కలిసి మోటార్ సైకిల్ పై జొన్నాడలో జరుగుతున్న పైడితలమ్మ జాతరకు పినతాడివాడ నుంచి గొడ్డుపాలెం మీదగా వెళుతున్నారు. గొడ్డిపాలెం నుంచి పిన తాడివాడ వైపు ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బొలెరో వాహనం, మోటార్ సైకిల్ బలంగా ఢీకొన్నాయి. దీంతో లక్ష్మణరావుకు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన వాసుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 ద్వారా విజయనగరం ఆసుపత్రికి తరలించారు. వచ్చే నెల 22న తన పెద్దమ్మ కూతురు వివాహం ఉండగా ముందే చేతికి అందిన ఒక్కగాని ఒక కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు లక్ష్మణరావు ఐఐటి చదువుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణరావు

వాహనాలపై చర్యలు తీసుకోవాలి

టోల్‌గేట్ ఫీజు చెల్లించకుండా తప్పించుకోవడానికి వాహనాలు అడ్డదారిలో రావడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ పట్నం వైపు వెళ్తున్న వాహనాలకు నాతవలస జాతీయ రహదారిపై టోల్‌గేట్ కట్టాల్సి వస్తుందని వాహన దారులు చాలా మంది అడ్డదారుల గుండా గ్రామాల్లో వచ్చి ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లాలన్నా, విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లాలన్నా జాతీయ రహదారి సవరవిల్లివద్ద నుంచి పిన తాడివాడ మీదగా నాతవలస రోడ్డు నుంచి జాతీయ రహదారి మీదకు వెళ్లిపోతున్నారు. దీంతో టోల్గేట్‌లో డబ్బులు కట్టనవసరం లేదని ఈ రహదారి గుండా చిన్న వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా వస్తున్నాయని అటువంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మెంటాడ: అక్రమంగా తరలిస్తున్న మదాన్ని ఆంధ్ర ఎస్ఐ దేవి బుధవారం పట్టుకున్నారు. పోరాం గ్రామానికి సమీపంలో ముగ్గురు వ్యక్తులు అక్రమ మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాటు వేసి వారి వద్ద నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జామి: మండలంలోని మాదవరాయ మెట్ట గ్రామానికి చెందిన క్వారీ కార్మికుడు ఎం.రాము (43) మంగళవారం రాత్రి బైకు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రాము ప్రస్తుతం విజయనగరం పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలారికి చెందిన కే.ఏర్నాయుడు తన బైకు పై తలారి వెళుతుండగా మెట్ట వద్దకు వచ్చేసరికి ఇంటి ముందున నిలబడి ఉన్న రాముని బలంగా ఢీ కొన్నాడు.